

చీఫ్ ఎడిటర్: దొండ్లవాగు భవ్య (జర్నలిస్ట్)

RNI.No:-APTEL/26/A2902

గ్లోబల్ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

"అతికొద్ది కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన"
"గ్లోబల్ వార్త" జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గాల్లో
రాయచోటి,
రాజంపేట, రైల్వేకోడూరు,
మదనపల్లి, పీలేరు,
తంబళ్ళపల్లి, పుంగనూరు
విలేకరులు కావలెను
వివరాలకు కింద ఉన్న ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.
ఫోన్ నెంబర్స్ - 7093627232, 9392480345, 08562-461571
MAIL ID : globalvarthaindia@gmail.com

సంపుటి 1 | సంచిక 60 | 1-11-2026 | ఆదివారం | పేజీలు -4 | వెల-రూ. 5

అనంతపురం జిల్లా రాప్తాడులో దారుణం

రాప్తాడు జడ్పి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిపై ఉన్మాది దాడి
అడ్డుకోబోయిన విద్యార్థినిపైనా దాడి... తీవ్రగాయాలు



దాడికి గురైన విద్యార్థికి అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స... పరిస్థితి విషమం

గ్లోబల్ వార్త - అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లా రాప్తాడు గ్రామంలోని జడ్పి పాఠశాలలో శనివారం ఉదయం 10గంటల ప్రాంతంలో దారుణం చోటు చేసుకుంది. రోజులాగే పాఠశాలకు వచ్చిన విద్యార్థినులు తమ, తమ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు వింటున్నారు. ఇంతలో అనుకోని దారుణం చోటు చేసుకుంది. చెట్లను కత్తిరించే ఎలక్ట్రికల్ మిషన్‌తో ఓ ఉన్మాది పాఠశాలలోని 10వ తరగతి గదిలో అడుగుపెట్టాడు. ఓ విద్యార్థిపై రెప్పపాటు కాలంలో మిషన్‌తో దాడికి పాల్పడ్డాడు. విచక్షణా రహితంగా బాలిక ముఖం, మెడ, చేతులపై గాయపరిచాడు. ఒళ్లంతా రక్తసిక్తం కావడంతో ఆ విద్యార్థి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది.. అడ్డుకోబోయిన మరో విద్యార్థిని పైనా దాడికి పాల్పడడంతో ఆమెకూ కాళ్లకు గాయాలయ్యాయి. మిగిలిన విద్యార్థులందరూ భయంతో బయటకు పరుగులు తాశారు. క్లాస్ టీచర్ ఏమి జరిగిందో తెలుసుకునే లోపే ఆ ఆగంతకుడు అక్కడి నుంచి పరారీ అయ్యాడు. ఉపాధ్యాయులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్షణాల్లో స్పెషల్ టీమ్ పోలీసులు అక్కడ కు చేరుకుని విచారణ చేపట్టారు.

అసలు ఏమి జరిగిందంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయిని విచారించగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో మరమ్మతుల పనులు జరుగుతున్నాయనీ, ఈ నేపథ్యంలో ఆగంతకుడు చెట్లు కత్తిరించే మిషన్‌తో లోపలికి రావడం చూసి అతను కూడా వర్కునే అనుకున్నామనీ, అంతగా గమనించలేదని చెప్పారు. క్షణాల్లోనే జరిగిన సంఘటనను చూసి తాము నిర్ఘాంతపోయా మనీ, అప్పటికే జరిగిన నష్టం జరిగిందని చెప్పారు. నిందితుడు విద్యార్థినికి బంధువని తెలిసిందన్నారు.

గాయపడిన విద్యార్థిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అందిన సమాచారం మేరకు ధర్మవరం వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సంఘటన గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిందితుడిని వదలిపెట్ట వద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. చిన్నారి చెల్లిని రక్తపు మడుగులో చూసిన నాకు కన్నీళ్లు ఆగలేదంటూ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్‌లో పోస్టు పెట్టారు.

జరిగిన సంఘటనను తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు, రాప్తాడు గ్రామస్తులు పాఠశాల వద్దకు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. బయటి నుంచి వచ్చిన వ్యక్తి విద్యార్థిపై దాడి చేస్తుంటే ఉపాధ్యాయులు ఏమి చేస్తున్నాంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది.

విద్యార్థినులపై దాడి చేసిన వ్యక్తిని వదిలిపెట్టం

పరిటాల సునీత హెచ్చరిక



అనంతపురం జిల్లాలో విద్యార్థినులపై జరిగిన దాడి ఘటనపై ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్రంగా స్పందించారు. ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థినులను ఆమె ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. దాడిలో గాయపడిన విద్యార్థినుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుం డటంతో వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. విద్యార్థినులపై దాడి చేసిన వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, నింది తుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్రంగా స్పందిం చారని పరిటాల సునీత తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారని.. బాధిత విద్యార్థి నులకు అండగా ఉండాలని ఆదేశిం చారని వెల్లడించారు. విద్యార్థినులపై దాడికి పాల్పడి ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారని తెలిపారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుని చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవ సరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


విద్యార్థినులపై రంపంతో దాడి చేయడం దారుణం

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న

అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో చోటుచేసుకున్న ఉన్మాది దాడి ఘటనను పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న తీవ్రంగా ఖండించారు. తరగతి గదిలోకి చొరబడిన ఉన్మాది విద్యార్థినిపై రంపంతో దాడి చేయడంతో పాటు, అడ్డొచ్చిన మరో విద్యార్థినిపై కూడా దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురై కన్నీళ్లు పెట్టుకోవడం హృదయవిదారకమని అన్నారు. పాఠశాలల్లోనే విద్యార్థులకు రక్షణ లేకపోవడం ప్రభుత్వ భద్రతా వైఫల్యాలకు నిదర్శనమని విమర్శించారు.

ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రాణాలకు భరోసా కల్పించలేని విద్యావ్యవస్థ ఎవరి కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఎం.అంకన్న డిమాండ్ చేశారు.

విద్యార్థిని తల్లికి ఫోన్ చేసి భరోసా ఇచ్చిన సీఎం చంద్రబాబు



గ్లోబల్ వార్త - మరావతి : అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ స్కూల్‌లో అమానుష దాడి ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న విద్యార్థిని తల్లితో సీఎం చంద్రబాబు నాయుడు ఫోన్‌లో మాట్లాడారు. ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయ పడిన విద్యార్థిని ప్రస్తుతం అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో బాధిత విద్యార్థి ని తల్లితో సీఎం ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. ధైర్యంగా ఉండాలని, నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. విద్యార్థినిని కాపాడు కునేందుకు అన్ని ప్రయత్నాలు చేద్దామని.. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

విద్యార్థినికి అందుతున్న వైద్య సాయంపై స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతోనూ ముఖ్యమంత్రి మాట్లాడారు. ఉన్మాది దాడిలో గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఇరువురు విద్యార్థినిలకూ మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

సమాజంలో ఇలాంటి దాడులకు చోటు లేదు :డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



అనంతపురం జిల్లా : రాప్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినిపై ఓ యువకుడు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. పాఠశాల తరగతి గదిలో ఉన్న పదో తరగతి బాలికపై చెట్లు నరికే రంపం యంత్రంతో ఓ యువకుడు దాడి చేశాడు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. విద్యార్థినిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బాలిక తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఆమెకు మెరుగైన వైద్య చికిత్స అందిం చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బాలిక కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం పవన్ భరోసా ఇచ్చారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి అమానవీయ ఘటనలకు సమాజంలో చోటు లేదని హెచ్చరించారు. కాగా, శనివారం ఉదయం పాఠశాలలో ఉన్న విద్యార్థినిపై ఓ యువకుడు దాడికి తెగ బడ్డాడు. ఉపాధ్యాయు రాలు మ్యాథ్స్ క్లాస్ చెబు తుం డగా.. దుండగుడు హఠాత్తు గా తరగతి గదిలోకి ప్రవేశిం చాడు. అందరూ చూస్తుం డగానే బాలికపై రంపం యంత్రంతో దాడి చేశాడు. ఈ ఘటనతో అక్క డున్న వారంతా నిర్ఘాంత పోయారు. తీవ్ర భయాం దోళనకు గురయ్యారు. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అప్ర మత్తమైన పాఠశాల సిబ్బంది బాధితురాలిని హుటాహుటిన ఆస్పత్రి కి తరలించారు. మరోవైపు, పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. కేసు నమోదు చేశారు.




‘ఓటు వేసి నేరుగా ఇంటికి వెళ్లాలి’..
జగన్‌కు డీఐజీ సూచన

గ్లోబల్ వార్త - కడప : నగరంలోని ఆర్ట్స్ కాలేజ్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీని డీఐజీ కోయ ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పులివెందుల్లో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చన్నారు. ఓటు వేసిన తర్వాత జగన్.. నేరుగా ఇంటికి వెళ్లాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా పులివెందుల పట్టణంలో తిరిగేందుకు ఆయనకు అనుమతి లేదన్నారు. పులివెందులలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా పులివెందుల, జమ్మలమడుగు, కడపలో అదనపు బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 వేల మంది పోలీసు బలగాలను మోహరించినట్లు డీఐజీ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. కాగా.. పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఎన్నికల రోజు తాను పులివెందులలోనూ ఉంటానని, ఎవరొస్తారో చూసుకుంటానంటూ మాస్ వార్నింగ్ ఇవ్వడం రాజకీయంగా రచ్చకు దారి తీసింది. అయితే జగన్ వ్యాఖ్యలపై కూటమి నేతలు కూడా ధీటుగా సమాధానం ఇచ్చారు.

కోనసీమలో కేంద్ర బృందం పర్యటన..
ఆర్నబ్ తుఫాన్ నష్టంపై ఆరా



గ్లోబల్ వార్త - అంబేద్కర్ కోనసీమ జిల్లా: ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో జరిగిన పంట, ఆస్తి నష్టం అంచనాలను రూపొందించేందుకు ఏర్పాటు చేసిన కేంద్ర బృందం ఏపీలో పర్యటిస్తోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించిన ఈ బృందం అక్కడి పరిస్థితులను పరిశీలించింది. రావులపాలెం సీఆర్‌సీలో తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టంపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. అరటి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని.. విద్యుత్ నష్టం, రహదారులు, ఆస్తి నష్టాలను వివరించారు. తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని వివిధ రంగాలకు జరిగిన నష్టాన్ని తెలియజేసేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని కేంద్ర బృందం సందర్శించింది. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో కొట్టుకుపోయిన, గల్లంతైన మత్స్యకారుల పడవలు, దెబ్బతిన్న వలలకు సంబంధించిన వివరాలను కేంద్ర బృందం అడిగి తెలుసుకుంది. ఈ బృందంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ ప్రశాంత్ అర్మోరికర్, ఆర్థిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ హిమాలయ గార్గ్, డిప్యూటీ డైరెక్టర్ ప్రణయ్ గార్గ్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సీఈఓ ప్రకర్ జైన్, విపత్తు నిర్వహణ రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులు ఉన్నారు.



తుఫాన్ బాధితులకు ఎస్‌బీఐ సాయం
సీఎం సహాయ నిధికి రూ.5.01 కోట్లు

గ్లోబల్ వార్త - అమరావతి : తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలిచేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముందుకొచ్చింది. ప్రకృతి విపత్తు కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడంతో పాటు రాష్ట్రంలో సహాయక చర్యలకు తోడ్పాటు అందించేందుకు తనవంతు సహాయాన్ని ప్రకటించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 కోట్ల లక్ష రూపాయల భారీ విరాళాన్ని అందించింది. తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ఎస్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలవడం, సామాజిక బాధ్యతలో భాగంగా సహాయం అందించడం అభినందనీయమని పేర్కొంటున్నారు.



కర్నూలు కార్పొరేషన్ పీఠం ఎవరిది?

గ్లోబల్ వార్త- కర్నూలు

కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది.. 68 వార్డులు.. ఒక మేయర్ పీఠం.. ఈ పీఠాన్ని దక్కించుకునేది ఎవరు? కర్నూలు కార్పొరేషన్‌పై జెండా ఎగురవేసే పార్టీ ఏది? అన్న ఉత్కంఠ రాజకీయ వర్గాలతో పాటు నగరవాసుల్లోనూ నెలకొంది. మేయర్ పీఠమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించగా.. ఇప్పుడు ఓటర్ల తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికారులు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 487 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఎన్నికల విధుల్లో 3,600 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొననున్నారు. వీరితో పాటు 22 మంది జోనల్ అధికారులు, 68 మంది స్పెషల్ రాపిడ్ అధికారులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 153 సమస్యాత్మక, మరో 153 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆయా కేంద్రాల్లో నిరంతర నిఘా కోసం 306 లైవ్ టీవీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇక మేయర్ పదవి కోసం 13 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. 68 వార్డుల్లో కార్పొరేటర్ స్థానాల కోసం 304 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మొత్తం 4 లక్షల 80 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భారీ పోలీసు బందోబస్తు, పటిష్టమైన నిఘా మధ్య ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కమిషనర్ చల్లా ఓబులేశు వెల్లడించారు. మొత్తానికి కర్నూలు కార్పొరేషన్ ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకోవడంతో.. ఓటరు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



ఎలాంటి సాయానికైనా సిద్ధం’
ఏపీ మంత్రికి తెలంగాణ డిప్యూటీ సీఎం ఫోన్

మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేశారు. ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఉపముఖ్యమంత్రికి మంత్రి గొట్టిపాటి రవి వివరించారు. సిబ్బంది, సామాగ్రిని కొరత ఉంటే తెలియజేయాలని భట్టి కోరారు. తెలంగాణ నుంచి ఎలాంటి సాయమైనా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో 1,100 మందికి పైగా తెలంగాణ విద్యుత్ సిబ్బంది పని చేస్తున్నారని ఏపీ మంత్రి తెలిపారు. ఏపీ డిస్కంలకు చెందిన 4,400 మంది సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో ఉన్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

విద్యుత్ లైన్ల పునరుద్ధరణ:

నరసాపురం డివిజన్ పాలకొల్లు సెక్షన్ పరిధిలోని అదర్శపాలెంలో 11 కేవీ విద్యుత్ లైన్లను విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. వరి పొలాలు, లోతైన చేపల చెరువుల్లోకి దిగి ప్రతికూల పరిస్థితులను కూడా లెక్కచేయకుండా శ్రమిస్తున్నారు. పునరుద్ధరణ పనుల్లో శ్రీ సత్యసాయి పుట్టపర్తి సర్కిల్, హిందూపురం డివిజన్ లైన్‌మెన్లు సేవలందిస్తున్నారు. మడకశిర సబ్ డివిజన్ పరిధిలోని అగళి సెక్షన్ అధికారుల బృందం ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ పనులు సాగుతున్నాయి.



ఉక్కుమనిషి స్ఫూర్తితో ఐక్యత యువత రక్తదానలకు ముందుకు రావాలి

ఉక్కుమనిషి, భారతదేశ ఐక్యతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దీజీవీ రాయలసీమ జోనల్ ఇంచార్జ్ గుడిపాటి సుబ్బరాజు గారు, విశిష్ట అతిథిగా దీజీవీ కడప జిల్లా అధ్యక్షులు మల్లికార్జున గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, భారతదేశ ఐక్యత కోసం ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. అటువంటి మహనీయుడి జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం. అభినందనీయమని తెలిపారు. యువత సర్దార్ వల్లభాయ్ పటేల్ గారిని స్ఫూర్తిగా తీసుకొని సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని, మనం ఇచ్చే ఒక్క రక్తపు బొట్టు మరొకరి ప్రాణాన్ని నిలబెట్టగలదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువ న్యాయవాది గంప సుబ్బారాయుడు గారు, తులసి వర్ధన్ రెడ్డి, జయవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్శ్రీధర్ చెరుకూరి



గ్లోబల్ వార్త – కడప

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పోలింగ్ సిబ్బంది, ఓటర్లు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. నవంబర్ 1వ తేదీన స్థానిక సంస్థల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో... పోలింగ్ కేంద్రాల్లోకి ఎవరెవరు ప్రవేశించవచ్చు, ఓటర్లు అనుసరించాల్సిన విధానం, ఎన్నికల సిబ్బంది విధులు, నిషేధిత చర్యలపై ఆయన పలు మార్గదర్శకాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు...

ఓటర్లు, వారితో వచ్చే చిన్నపిల్లలు, ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, నిబంధనల ప్రకారం అనుమతి పొందిన వ్యక్తులు మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించాలి.

అంధులు, శారీరక వైకల్యం లేదా అనారోగ్యం కారణంగా స్వయంగా నడవలేని ఓటర్లు తమ వెంట ఒక సహాయకుడిని తీసుకెళ్లవచ్చు.

ఓటర్లు తమ గుర్తింపు కోసం ఓటరు గుర్తింపు కార్డు లేదా ఎన్నికల సంఘం అనుమతించిన ఇతర గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి చూపించాలి. ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు, ఫొటోతో కూడిన పదో తరగతి ధ్రువపత్రం, నిర్దేశిత బ్యాంకు పాస్‌బుక్ తదితర పత్రాలను గుర్తింపునకు ఉపయోగించవచ్చు.

ఎడమచేతి చూపుడు వేలికి వేసిన చెరగని సిరాను తనిఖీ చేయించుకుని, ఓటర్ల జాబితాలో పేరు పరిశీలన అనంతరం సంతకం లేదా వేలిముద్ర వేయాలి.

బ్యాలెట్ పత్రం ద్వారా ఓటు వేసే సమయంలో ఓటింగ్ గదిలోకి వెళ్లి, తమకు నచ్చిన అభ్యర్థి గుర్తు పక్కన నిర్దేశిత విధంగా ఓటు వేసి, బ్యాలెట్ పత్రాన్ని మడిచి బాక్సులో వేయాలి.

ఓటు వేసిన వెంటనే పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లాలి.

ఓటింగ్ సమయంలో అనవసర జాప్యం చేయరాదు.

పోలింగ్ ప్రారంభానికి ముందు ఖాళీ బ్యాలెట్ పెట్టెను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు చూపించి, వారి సమక్షంలోనే ముద్ర వేయాలి.

ఒకేసారి పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే ఓటర్ల సంఖ్యను ప్రిసైడింగ్ అధికారి నియంత్రిస్తారు.

పోలింగ్ కేంద్రాల్లో నిషేధిత చర్యలు...

పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, ఓట్లు అభ్యర్థించడం నిషేధం.

ఓటర్లను వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించరాదు.

పోలింగ్ కేంద్రంలో లేదా పరిసర ప్రాంతాల్లో గొడవలు చేయడం, ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, అధికారులను అడ్డుకోవడం చేయరాదు.

ఇతరుల పేరుతో ఓటు వేయడం, దొంగ ఓటుకు పాల్పడటం చట్టరీత్యా నేరం.

ఒకేసారి ఇద్దరు ఓటర్లు ఒకే ఓటింగ్ గదిలోకి ప్రవేశించరాదు.

ఓటు గోప్యతకు భంగం కలిగించేలా బ్యాలెట్ పత్రాల వివరాలను నమోదు చేయడం లేదా ఇతర చర్యలకు పాల్పడరాదు.

పొగాకు ఉత్పత్తులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకురావడం నిషేధం.

మొబైల్ ఫోన్లు, కెమెరాలను ఓటింగ్ గదిలోకి తీసుకెళ్లడం, ఓటు వేసే విధానాన్ని చిత్రీకరించడం చేయరాదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు అభ్యర్థిగా లేదా ఓటరుగా మినహా ఇతర హోదాల్లో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించరాదు.

పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లకు ఆహారం, మద్యం పంపిణీ చేయరాదు.

సమస్యలుంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి

పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు లేదా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటే అభ్యర్థులు, వారి ఏజెంట్లు జిల్లా ఎన్నికల అధికారి లేదా ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. అంతేకానీ పోలింగ్ కేంద్రాల్లో గందరగోళం సృష్టించడం, ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు.

ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను గౌరవించాలని, ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



ఈ హాస్పిటల్ లో గుండె ఆపరేషన్లు పూర్తిగా ఉచితం

మెదడుకు , నరాలకు ఎటువంటి అనారోగ్యం కలిగినా కూడా .... ఎంత మేజర్ ఆపరేషన్ అయినా కూడా ఈ హాస్పిటల్ లో పూర్తిగా ట్రీట్ మెంటు కిడ్నీలకు , మూత్ర సంబంధిత ఎలాంటి ఆరోగ్య సమస్య అయినా కూడా పూర్తిగా ఆపరేషన్లు ఈ ఆసుపత్రిలో వైద్యానికి ఒక్క రూపాయి కూడా తీసుకోరు. ఎటువంటి పెద్ద ఆపరేషన్ కు అయినా కూడా ఒక్క పైసా కూడా తగలరు అవసరంలో ఉన్న ఎవరికి అయినా ఉపయోగపడొచ్చు. ఇది షేర్ చెయ్యడానికి 5 సెకన్లు చాలు. ఈ మంచి విషయాన్ని షేర్ చేసి, ప్రాణరక్షణకు మీవంతుగా తోడ్పడండి. వైట్ ఫీల్డ్, బెంగళూరు ఈ హాస్పిటల్లో మెదడు, నరములు, గుండె, కిడ్ని మరియు మూత్ర సంబంధించినవి అన్ని కూడా పేషెంటు పరిస్థితిని బట్టి ఆపరేషను లు పూర్తి ఉచితంగా చేస్తారు. హాస్పిటల్ కు వచ్చే ముందుగా రేషన్ కార్డు, ఆదార్ కార్డు, ఇతర ఆసుపత్రులలో చూపించుకున్న పాత మెడికల్ రిపోర్ట్స్ ఉంటే అవి కూడా తప్పనిసరిగా తీసుకొని రావాలి. ఈ హాస్పటల్‌లో చూపించుకోవాలి అంటే తెల్లవారు జామునే 4 గంటలకే క్యూలో నిలబడాలి. 6 గంటలకు సేవాదళ్ వారు వచ్చి టోకన్స్ ఇస్తారు. ఇందులో చూపించుకొనేవారు, వారికి తోడుగా మరొకరు వుంటేనే హాస్పిటల్ లో టోకన్స్ ఇస్తారు. ఈ హాస్పటల్ లో వచ్చువారికి తక్కువ ధరకు టిఫిన్, భోజనము , హాస్పిటల్ లోపల ఉన్న క్యాంటిన్ లో ఇస్తారు.

అభివృద్ధి ఆకాంక్ష మీ వంతు, నెరవేర్చడం మా వంతు

పుర ప్రజలకు పిలుపునిచ్చిన బీటెక్ రవి

గ్లోబల్ వార్త – పులివెందుల



పులివెందుల పట్టణ పరిధిలో అభివృద్ధి ఆకాంక్ష ప్రజలదైతే వాటిని నెరవేర్చే బాధ్యత కూటమి ప్రభుత్వాన్నిదని, పుర పోరులో తూగుట్ల గీతా కుమారి విజయానికి సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ , లోకేష్ బాబు మంచి సంకల్పంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పరిపాలన సాగిస్తున్నారని, వారి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ పులివెందుల మున్సిపాలిటీని అత్యధిక మెజార్టీతో గెలిపించి వారికి బహుమతిగా ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం ద్వారా పులివెందుల పట్టణ అభివృద్ధి సాధ్యమని, అస్తవ్యస్త విధానాలకు స్వస్తి పలికి భావితరాల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా వారి ఆలోచనల మేరకే అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసి ఆచరణలోకి తీసుకువస్తామని పులివెందుల పుర ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఒక్క అవకాశం ఇచ్చి తమ అభివృద్ధి ఆకాంక్షను నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు.



నవధాన్యాలు వేద్దాం...భూసారాన్ని పెంచుదాం

గ్లోబల్ వార్త –లింగాల ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎన్ వి ప్రవీణ్ కుమార్ సూచనల మేరకు లింగాల మండలం అక్కులాగారిపల్లి గ్రామం లోని చీని రైతు నర్రాల రామ్మోహన్ రెడ్డి, పెద్దకూడాలా ఎక్స్ ఆర్మీ గోపాల్ రెడ్డి పొలం లో ప్రధాన పంట చీని మధ్యలో నవధాన్యాలు విత్తనాలు 5 ఎకరాలు విత్తడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నవధాన్యాలు వేసుకోవడం వలన ఆర్గానిక్ కార్బనము వస్తుంది అదేవిధంగా నవధాన్యాల మొక్కల వేర్ల నుండి భూమికి కావలసిన పోషకాలు అందుతాయి నీటిని భూమిలో పట్టి ఉంచే గుణాన్ని కలిగించుతాది అదే విధంగా ప్రధాన పంటకు కావలసిన అన్ని రకాల పోషకాలు అందిస్తాయి. పీఎండీయస్(నవధాన్యలు) సాగు చాలా మంచిది ప్రతి రైతు కూడా కాలి భూములో వేసుకొని వాటిని చెట్లు మోదుల్లో అచ్చదన గా పశువు లకు మెత గా వాడు కోవచ్చు అన్నారు. ప్రకృతి వ్యవసాయ ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ జయ నాయక్ మాట్లాడుతూ నవదన్యాలు కాలిగా ఉన్న పొలాల్లో వేసుకోవడం వలన ఆ మొక్కలు వేర్లు నుండి భూమి సారవంత మైన మట్టిని కొట్టుకొని పోకుండా కాపాడుతుంది భూమి గుల్లబారి నీటిని పట్టి ఉంచుకొనే గుణాన్ని కలుగు తుంది ప్రధాన పంటకు కావలసిన పోషకాలు అందుతాయి అన్నారు ఈ కార్యక్రమం లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది , ఐసీర్పీ. ,యశోద, ,రైతులు పాల్గొన్నారు

మున్సిపల్ ఎన్నికల విధులపై పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం



గ్లోబల్ వార్త – పుట్టపర్తి మున్సిపాలిటీలో రేపు ఆదివారం పుట్టపర్తి లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ శ్రీ ఎన్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఎన్నికల విధులకు నియమించబడిన పోలీసు అధికారులు, సిబ్బందికి పుట్టపర్తి డీఎస్పీ శ్రీ మాణిక్యరావు విధుల నిర్వహణపై ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించి పలు సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. సందర్భంగా డీఎస్పీ గారు మాట్లాడుతూ ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బంది సమయానికి తమకు కేటాయించిన విధుల్లో రిపోర్ట్ చేయాలి.పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలి. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అనవసరంగా గుంపులు గుమిగూడకుండా చూడాలి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలి.ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పని సరిగా పాటించాలి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ పుట్టపర్తి మున్సిపాలిటీలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డిఎస్పీతో పాటు సిఐలు యువరాజు, సురేష్, శ్రీనివాసులు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మవరం సిడిపిఓ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

గ్లోబల్ వార్త – ధర్మవరం

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సిడిపిఓ) కార్యాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్, వివిధ రికార్డులను, ఉద్యోగుల హాజరు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బంది విధులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పోషకాహార కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు అందిస్తున్న పోషకాహార సరుకులు నాణ్యతతో, నిర్దేశిత పరిమాణంలో క్రమం తప్పకుండా పంపిణీ చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఎప్పటికప్పుడు బరువు, ఎత్తు కొలతలు తీసి తీవ్ర లోపపోషణ ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సిడిపిఓ, సూపర్ వైజర్లు తరచుగా క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో ధర్మవరం సిడిపిఓ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భోజనం చేస్తూ ఫోన్ చూస్తున్నారా..? అయితే ఈ సమస్యలు తప్పవు



ఈరోజుల్లో భోజనం తింటూ ఫోన్ చూడటం చాలా మామూలు విషయం. చాలామంది ఆహారాన్ని తీసుకుంటూ మొబైల్ చూడటానికి అలవాటుపడిపోయారు. అయితే ఈ అలవాటు ఆరోగ్యంపై పలు ప్రభావాలు చూపిస్తుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. తినే సమయంలో కూడా ఫోన్‌కు రెస్ట్ ఇవ్వక పోతే పలు సమస్యలు వస్తాయని అంటున్నారు. అవేంటో తెలుసుకుందాం..జీర్ణక్రియపై ప్రభావం.. భోజనం చేస్తూ మొబైల్ చూడటం వల్ల జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మన ధ్యాస తినటంపై కాకుండా ఫోన్‌పై ఉన్నప్పుడు ఆహారాన్ని సరిగ్గా నమలలేము. దీనివల్ల గ్యాస్, అజీర్ణం, కడుపు నొప్పి వంటి సమస్యలొస్తాయి. అందుకే తినేటప్పుడు ఫోన్ చూడొద్దంటున్నారు వైద్య నిపుణులు.

కళ్లకూ హాని

ప్రస్తుతం మన రోజువారీ స్క్రీన్ టైమ్ చాలా ఎక్కువగా ఉంటోంది. భోజనం చేస్తున్న సమయాల్లో కూడా ఫోన్ చూడటం వల్ల స్క్రీన్ టైమ్ మరింత పెరిగిపోతోంది. కళ్లకు విశ్రాంతి కరువవుతోంది. కాబట్టి భోజన వేళల్లో మొబైల్ దూరం పెట్టాలని నిపుణులు చెబుతున్నారు. అప్పుడు కళ్లకు కాస్త విశ్రాంతి దొరుకుతుందని వివరిస్తున్నారు.

మానసిక ఆరోగ్యంపై దెబ్బ

ఫోన్ చూస్తూ ఆహారం తీసుకునే అలవాటు మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. తినేటప్పుడు మొబైల్ ఉపయోగించటం వల్ల ఆహారాన్ని ఆస్వాదించలేము. తద్వారా మానసిక సంతృప్తి దూరమై, ఒత్తిడి పెరుగుతుందని వైద్యులు అంటున్నారు.

సామాజిక సంబంధాలు

ఇదివరకు భోజన వేళల్లో కుటుంబంతో గడిపేవారు. ఇప్పుడు ఫోన్లలో మునిగిపోతున్నారు. దీనివల్ల సామాజిక సంబంధాలు దెబ్బతింటాయని మానసిక నిపుణులు వెల్లడిస్తున్నారు. అందుకే ఈ సమయంలో ఫోన్‌కు దూరంగా ఉండాలని సలహా ఇస్తున్నారు.



జనసేన అభ్యర్థిని గెలిపించాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పిలుపు

గ్లోబల్ వార్త– చిలకలూరిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు వ్యవహారంపై చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్పందించారు. పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అక్రమ కేసుల్లో ఇరికించి అన్యాయంగా జైలుకు పంపించారని ఆరోపిం చారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆనాటి పరిణామాలను గుర్తుచేశారు. నాటి వైసీపీ ప్రభుత్వం తెలుగు దేశం పార్టీని రాష్ట్రంలో లేకుండా చేయాలనే దురుద్దేశంతో రాజకీయ కుట్రలకు పాల్పడిందని ప్రత్తిపాటి విమర్శించారు. చంద్రబాబుపై అక్రమ కేసులు నమోదు చేసి ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసుల విషయంలో ఏసీబీ కోర్టులో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ జగన్ ప్రభుత్వం రాజకీయ కక్షతో వ్యవహరించిందని అన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయని, తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారని పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా కూటమి ప్రభుత్వం 94 శాతం ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇక చిలకలూరిపేట మున్సిపల్ ఎన్నికలపై మాట్లాడుతూ.. స్థానిక మున్సిపాలిటీని జనసేన పార్టీకి కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 21 మున్సిపాలిటీలను జనసేనకు కేటాయించగా, వాటిలో చిలకలూరిపేట మున్సిపాలిటీ గెలుపు అవకాశాలున్న స్థానాల్లో ముందంజలో ఉందని పేర్కొన్నారు. వైసీపీకి ఓటు వేయడం అంటే అన్యాయాలు, అక్రమాలకు మద్దతు ఇచ్చినట్లేనని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో జనసేన, కూటమి అభ్యర్థికి అఖండ మెజారిటీ అందించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు.

రాప్తాడు ఘటనపై మహిళా కమిషన్ ఆరా

బాధితులకు అందుతున్న వైద్యంపై ఎప్పటికప్పుడు వివరాల సేకరణ

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ వెల్లడి

అనంతపురం: రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ స్పందించింది. ఈ ఘటనలో గాయపడిన బాధిత విద్యార్థినులతో పాటు, దాడిని అడ్డుకునే క్రమంలో గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. బాధిత విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై మహిళా కమిషన్ ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తోందని రాయపాటి శైలజ తెలిపారు. పాఠశాలలో విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనపై మహిళా కమిషన్ దృష్టి సారించిందని, గాయపడిన విద్యార్థినుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.



అంజనేయునికి విశేష పూజలు

గ్లోబల్ వార్త – సింహాద్రిపురం

సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచా మృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహ కులు మాట్లాడుతూ ప్రతి శనివారం , మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్య క్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



మనమిత్ర ఆలోచన అద్భుతం

- తుపాన్ సమయంలో ప్రజల నుంచి సమస్యలు స్వీకరించడం బాగుంది
- ఆర్టీజీఎస్ నుంచి విపత్తుల నిర్వహణ విధానం భేష్
- ఏపీ చొవర మిగిలిన రాష్ట్రాలకూ ఆదర్శం కావాలి
- కేంద్ర బృందం ప్రశంసలు
- కేంద్రం నుంచి తగినంత సాయం అందేలా కృషి చేస్తామన్న అధికారులు
- తుపాన్ తీరం దాటే వరకు నిరంతరం ప్రజలను అప్రమత్తం చేశాం
- తుపాన్ సమయంలో ఎవర్నీ ఇళ్లు దాటి బయటకు రావద్దని సూచించాం
- ముందస్తు జాగ్రత్తలతో ప్రాణనష్టం తగ్గించగలిగాం



గ్లోబల్ వార్త - అమరావతి: అర్నబ్ తుపాన్ కలిగించిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వ పరిశీలనా బృంధం రాష్ట్రానికి వచ్చింది. ఇందులో భాగంగా శనివారం ఈ బృందం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించింది. ఆర్టీజీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ లు ఈ బృందానికి స్వాగతం పలికారు. అర్నబ్ తుపాన్ వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం గురించి కేంద్ర బృందానికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయిక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన బృందం రాష్ట్రానికి వచ్చింది. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ అధికారులు తుపాన్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ముందస్తు సన్నద్ధత చర్యల గురించి కేంద్ర బృందానికి వివరించారు.

ప్రాణనష్టం తగ్గించగలిగాం


అర్నబ్ గురించి ఆరు రోజుల ముందు నుంచే ప్రజలను నిరంతరం అప్రమత్తం చేశాం, ఆర్టీజీఎస్ నుంచి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) నుంచి ప్రజలకు నిరంతరం తుపాన్ హెచ్చరికలు జారీ చేశామని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. 7.23 కోట్ల మంది మొబైల్ వినియోగదారులకు నిరంతరం తుపాన్‌కు సంబంధించి హెచ్చరికలు జారీ చేశాం. తుపాన్ తీరం దాటే సమయంలో ప్రజలు ఎవ్వరూ కూడా తమ ఇళ్ల నుంచి బయటకు రాకుండా చేయడంతో పాటు రహదారులపై వాహనాల రాకపోకలను నిలిపేశాం, తద్వారా ప్రాణ నష్టం పెద్దగా వాటిల్లకుండా చేయగలిగాం. తుపాన్ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వివిధశాఖల మధ్య సమన్వయంతో పనిచేసేలా ఆర్టీజీఎస్ నుంచి పర్యవేక్షించాం. వివిధ శాఖలు తుపాను సహాయ చర్యలు చేపట్టడానికి జిల్లా, మండల స్థాయిలో 3,455 కంట్రోలు రూములు ఏర్పాటు చేసుకున్నాయి, 3,918 నోడల్ అధికారులను నియమించాం. 2,199 తుపాన్ షెల్టర్లను 20 జిల్లాలో ఏర్పాటు చేశాం. 34,716 మందిని ఈ షెల్టర్లకు తరలించాం. సహాయక చర్యల కోసం 16 ఎన్డీఆర్ ఎఫ్, 11 ఎస్‌డీఆర్ ఎఫ్ బృందాలను 14 జిల్లాలకు తరలించాం, అత్యవసర వైద్య సేవల కోసం 1,355 అంబులెన్సు వాహనాలను సిద్ధం చేసి ఉంచాం, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 3,012 మంది గర్భిణిలను ఆసుపత్రులకు తరలించాం. తుపాన్ సమయంలో ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే అత్యవసర సాయం కోసం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆ సమస్యలను ప్రభుత్వానికి షేర్ చేసే సదుపాయం కల్పించాం. వచ్చిన సమస్యలను వచ్చినట్లే పరిష్కరించాం. మనమిత్ర ద్వారా వచ్చిన అర్నబ్ తుపాన్ సంబంధిత సమస్యల్లో 95 శాతానికిపైగా పరిష్కరించగలిగాం. మత్స్యకారులెవ్వరూ కూడా చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లకుండా ముందస్తుగానే నిలువరించగలిగాం. మత్స్యకారులకు చెందిన 30,043 ఫిషింగ్ బోట్లు రేవులకే పరిమితమయ్యేలా చేశామని ఆర్టీజీఎస్ అధికారులు నివేదించారు.

రూ.4,764 కోట్ల నష్టం

అర్నబ్ తుపాన్ వల్ల రాష్ట్రంలో రూ.4,764 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు అధికారులు కేంద్ర బృందానికి తెలిపారు. 4.63 లక్షల మంది రైతులకు చెందిన 3.52 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 23,383 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. 2,491 కిలోమీటర్ల మేర రాష్ట్ర ప్రధాన రహదార్లు దెబ్బతిన్నాయని అధికారులు చెప్పారు. 7,382 ఇళ్లు దెబ్బతిన్నాయి. 12 జిల్లాల్లో తుపాన్ వల్ల నష్టం వాటిల్లిందని అయితే కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాలు దారుణంగా దెబ్బతిన్నాయని చెప్పారు. విద్యుత్తు రంగానికి భారీగా నష్టం వాటిల్లిందని చెప్పారు.

మనమిత్ర ఆలోచన అద్భుతం

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించిన విధానం కేంద్ర బృందాన్ని అమితంగా ఆకట్టుకుంది. ఈ ఆలోచన అద్భుతమని, దీనివల్ల ప్రజలు సులభంగా వాట్సాప్ ద్వారా తమ సమస్యలు ప్రభుత్వానికి చేరవేయడానికి వీలైందని, ఈ తరహా విధానం ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయమని, అందరూ మనమిత్ర లాంటి సదుపాయాన్ని తమ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకునేలా సిఫారసు చేయమని కేంద్రానికి నివేదిస్తామని కేంద్ర బృందం తెలిపింది. రిలయ్ టైమ్ గవర్నెన్స్ ద్వారా విపత్తుల నిర్వహణ రియల్ టైమ్‌లో పర్యవేక్షించిన విధానాన్ని కూడా కేంద్ర బృందం ప్రశంసించింది. అర్నబ్ తుపాన్ నష్టంపై ఆర్టీజీఎస్ అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ పట్ల కేంద్ర బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. కేంద్రం నుంచి తగినంత సాయం రాష్ట్రానికి అందేలా తమ వంతు కృషి చేస్తామని చిత్తరంజన్ దాస్ తెలిపారు. విపత్తు నుంచి బయటపడేలా ఏపీకి తక్షణ సాయం అందించేలా కేంద్రానికి సిఫారసు చేస్తామన్నారు.



ఓటు విలువను నీరుగార్చిన విధానాలెన్నో..!

ప్రజాస్వామ్యం అంటే ప్రజాభిప్రాయం. ప్రజాభిప్రాయానికి ఏకైక ప్రతీక ఓటు. స్వతంత్ర భారత దేశము ప్రజలకు అందించిన అందరికీ సమాన హక్కును కల్పిస్తూ అందించిన అంతిమ ఏకైక ఆయుధం ఓటు. అలాంటి ఓటు పట్టుమని పది సంవత్సరాలైనా సరే స్వతంత్రంగా ఉన్నదో లేదో గానీ వేటగాళ్ల కాట్లకు గురవుతూనే ఉన్నది. వేటగాళ్లు ఒక్కరా ఇద్దరా! అనేకులు! ఓటుకు పడిన గాట్ల వల్ల ప్రజాస్వామ్యమే ఖూనీ అయిపోయింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుపైన గత రెండేండ్లుగా జరుగుతున్న ఓటర్ లిస్టుల ప్రక్షాళన సందర్భంగా దాదాపు 13.5 కోట్ల ఓటర్లను లిస్టులోంచి తొలగించారన్న అంశంపై వివాదం తారస్థాయికి చేరింది. జంతర్ మంతర్ దగ్గర కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల10వ తారీఖున పెద్ద ఎత్తున నిరసనకు దిగడం, ముందస్తు అరెస్టులు ఆ తరువాత ఇండియా కూటమి హలో సుప్రీం కోర్టు వంటివన్నీ కొత్త పరిణామాలు. ఈ సందర్భంగా ఓటర్ లిస్టుల ప్రక్షాళనలో జరుగుతున్న అవకతవకలు ఒకమాట అయితే ఎన్నికల సంఘం ప్రతిష్ట పూర్తిగా మసకబారే విధంగా ఈ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ సాగిందని అర్థమవుతుంది. స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో రాజ్యాంగం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అట్లాంటి రాజ్యాంగంలో అత్యంత కీలక భూమిక పోషించవలసిన ఒక ప్రధాన అంగము భారత ఎన్నికల కమిషన్. ఆ ఎన్నికల కమిషన్ ఈరోజు ఒక కళంకాన్ని ఎదుర్కొంటుంది. భారత ఎన్నికల సంఘానికి ప్రతిష్ట మసకబారితే భారతదేశ ప్రజాస్వామ్యముకే విలువ ఉండదు. నిజానికి కేవలం ఈ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ సందర్భంగా తలెత్తిన వివాదాంశాల కన్నా మించిన ప్రక్షాళన ఓటుకు సంబంధించి మరింత లోతుగా భారతదేశ ఎన్నికల వ్యవస్థను భారతదేశంలో జరుగుతున్న ఓటింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఓటు నమోదు నుంచి ప్రజాప్రతినిధుల కాలం ముగిసే వరకు ఓటరు నిర్ణయానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి. కానీ ఓటు నమోదు నుండి ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధి పదవి కాలం ముగిసే వరకు ఓటరు అంతిమ నిర్ణయానికి ఎన్నో రకాల తూట్లు పొడుస్తున్నారు. నిజానికి ఓటు అమ్ముడిపోతున్నది, ఓటర్లు తమను తాము అమ్ముకుంటు న్నారు అని ఓటరు పైన నిందలు వేస్తాం. కానీ అది అబద్ధం. అభ్యర్థులు ఓటర్లను అభ్యపెట్టి ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నారు. ఓటు నమోదు ప్రభుత్వం బాధ్యత. భారతదేశ పౌరులందరికీ విధిగా ఓటు హక్కును కల్పించవలసినది ప్రభుత్వమే. అలా కల్పించిన ఓటు స్వేచ్ఛగా వినియోగించే అవకాశం కూడా ఇవ్వాలి. కానీ ఈరోజు ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వేసే పరిస్థితి లేదు. ఎన్నికల హడావిడి మొదలైనప్పటి నుండి ఓటరుపై విపరీతమైన ప్రభావం ఉంటుంది. ఆ ప్రభావం ఎన్నో ప్రలోభాలతో కూడుకొని ఉంటుంది. అభ్యర్థులు తమ అవసరాల కోసం ఓటర్లను ప్రలోభపెట్టి, డబ్బులు పంచడం అనేది భారతదేశ ఎన్నికల వ్యవస్థలో సాధారణ అంశంగా మారింది. ఎన్నికల్లో డబ్బులు పంచబడుతున్నాయన్న విషయం ఎన్నికల సంఘానికి తెలియనిది కాదు. అయినా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అంటే ఓటును వేటాడుతున్న వారిని వదిలేసినట్లే అర్థం. ఎన్నికల వ్యవస్థ అభ్యర్థులకు విధించిన ఎన్నికల ఖర్చు పరిమితి పై ఏమాత్రము చర్య తీసుకోదు. చర్యల అంశాన్ని పేపర్ పైన మాత్రమే వదిలేస్తారు. ఎన్నికలలో అభ్యర్థులకు కేటాయించే గుర్తుల నుండి అభ్యర్థులు సాగించే ఎన్నికల ప్రచారంలో వారు ఉల్లంఘించే ఎన్నికల కోడును కూడా సీరియస్ గా తీసుకోరు. అంతేకాకుండా అభ్యర్థులు చేస్తున్న దుష్ప్రచారంపై లేదా కొన్ని నిబంధనల ప్రకారం కులము, మతము, ప్రాంతం, మిలిటరీ వంటి అంశాలను ప్రస్తావించకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ కూడా అభ్యర్థులు అట్లాంటి నిబంధనలను ఉల్లంఘిస్తుంటే ఎన్నికల సంఘం గాని, అధికారులు గాని చర్యలు తీసుకున్న సందర్భాలు తక్కువ. అధికార పార్టీ పై ఎప్పుడు తీసుకోరు. అంతేకాకుండా ఎన్నికల సంఘం అధికార పార్టీకి ఊడిగం చేసే విధంగా ఎన్నికల తేదీలను ప్రకటిస్తూ ఎన్నికలను నిర్వహిస్తుంటే ఓటర్లు లేదా ఓటును స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించే అవకాశాన్ని ఎక్కడ ఇచ్చినట్లౌతది. ఇక ఓటును ప్రభావితం చేయగలిగిన రెండవ అంశం రాజకీయ పార్టీలు. రాజకీయ పార్టీలు ఈ దేశంలో కుల, మత, ప్రాంత ఆధిపత్య కూటమిలుగా విభజించబడ్డాయి. అందుచేత అస్తిత్వ రూపాలలో ఓటర్లను పూర్తిగా ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కులాల ప్రాబల్యంతో ఓటు విలువిలాడిపోతుంది. కులమే అభ్యర్థి, పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తోంది. అంటే స్వేచ్ఛగా రాజ్యాంగం ప్రకారము పరిపాలన కోసం ఓటు వేయాల్సినటువంటి స్థితి ఈరోజు అనేక రాష్ట్రాలలో లేదన్నమాట. రాజకీయ పార్టీలు అభ్యర్థులను కరారు చేసేటప్పుడు కూడా కులమత ప్రాంతాలకు ఆర్థికంగా బాగా ధనవంతులకు మాత్రమే ఇచ్చే పరిస్థితి తీసుకొచ్చారు. అంటే ఎన్నికల వ్యవస్థలో ధనబలం ఇతరతరా అస్తిత్వ బలాలు ఎంత ప్రభావం చూపిస్తున్నాయో దానికి కారణం ఎవరయ్యా రంటే పార్టీలేనన్న విషయాన్ని మరవరాదు.

ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావం దినోత్సవం

గ్లోబల్ వార్త - కడప : కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక సంఘం ఏఐటీయూసీ సంఘం అని ఏఐటీయూసీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి. ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి కెసి. బాదుల్లా. కొనియాడారు కడప నగరంలో ఏఐటీయూసీ 107 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కడప నగరంలో ఏఐటీయూసీ కడప నగర సమితి ఆధ్వర్యంలో పలు సెంటర్లో ఏఐ టీయూసీ జెండా ఆవిష్కరించారు. కడప పాత మున్సిపల్ ఆఫీసులో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి. రైల్వే గుడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ దగ్గర ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసి. బాదుల్లా. పాత రిమ్స్ ఆటో స్టాండ్ దగ్గర ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె. మద్దిలేటి. జెండాను ఆవిష్కరించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, కేక్ కటింగ్ చేసి కార్మికులతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసి భాదుల్లా. మాట్లాడుతూ అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) మన భారతదేశంలో మొట్టమొదటి కేంద్ర కార్మిక సంఘం 1920 అక్టోబర్ 31న దేశ వాణిజ్య రాజధాని ముంబాయి నగరంలో పురుడు పోసుకున్నది మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులలో కార్మిక గర్జవల నుండి ఏఐటీయూసీ ఆవిర్భవించింది, భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం అందరికన్నా ముందే నినదించి సంఘం



ఏఐటీయూసీ, దేశ స్వాతంత్ర్య సముపార్జన కొరకు పోరు కలిపిన మొనగాడి సంఘం కార్మిక హక్కుల కొరకు జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం అలుపెరగని పోరాటాలు చేసి కార్మిక వర్గం నేడు అనుభవిస్తున్న సౌకర్యాలను అమల్లో ఉన్న చట్టాలను ఎన్నిటినో సాధించిందన్నారు. ఏఐటీయూసీ 107 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ కడప నగర సమితి ఆధ్వర్యంలో కడప నగరంలో జెండా ఆవిష్కరణ చేసే నాయకులు, .రైల్వే గూడ్స్ షేడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ దగ్గర:ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసి బాదుల్లా. పాప వన్ టౌన్ కే ఎస్ ఆర్ ఎమ్ ఆటో స్టాండ్ దగ్గర: కామ్రేడ్. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిఎల్. నాగసుబ్బారెడ్డి ఆర్టీసీ వర్క్ షాప్ దగ్గర: కామ్రేడ్. అంకిరెడ్డి. ఏపీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సి డబ్ల్యూ సి హమాలీవో వర్కర్స్ గోడౌన్ : గౌరవ అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం.రాజు ఎలక్ట్రికల్ ఆఫీస్ దగ్గర: కామ్రేడ్ బ్రహ్మానంద రెడ్డి. ఏపీ ఎలక్ట్రిసిటీ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా కార్యదర్శి ఓల్డ్ రీమ్స్ ఆటో స్టాండ్ దగ్గర: కామ్రేడ్.ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె. మద్దిలేటి వినాయక నగర్ సర్కిల్ ఆటో స్టాండ్ దగ్గర: కామ్రేడ్. పిచ్చినేని.సుబ్బరాయుడు ఏఐటీ యూసీ కడప నగర వర్కింగ్ ప్రెసిడెంట్. పాత మున్సిపల్ ఆఫీస్ దగ్గర: కామ్రేడ్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఏపీ ఎంప్లాయిస్ యూనియన్: కామ్రేడ్ మూర్తి. ఏపీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా నాయకులు సివిల్ సప్లై హమాలి యూనియన్ మార్కెట్ యార్డ్ దగ్గర: కామ్రేడ్ పిచ్చినేనీ సుబ్బరాయుడు. ఏఐటీయూసీ కడప నగర వర్కింగ్ ప్రెసిడెంట్, ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి. ఏఐటీయూసీ నగర నాయకులు.పిచ్చినేని. సుబ్బరాయుడు. పుల్లయ్య. తారక రామారావు, ఈశ్వరయ్య, నరసింహులు, రమణ, శాంతమ్మ, హనుమంతు, సూరి, భాస్కర్, శ్రీనివాసులు, శివరాం, భాస్కర్ రెడ్డి, పెంచలయ్య, కార్తిక్, నాగరాజు, రవి, ఓబయ్య, శివ,రాజశేఖర్, రమణ, చంద్ర, తదితరులు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



మంగళపూరులో హోరెత్తిన సైకిల్

మంగళపూరులో టీడీపీ ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన

వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సొంత గ్రామంలో టీడీపీ ప్రచార సందడి

వెడిచర్ల సెగ్మెంట్‌లో గెలుపుపై టీడీపీ శ్రేణుల ధీమా

గ్లోబల్ వార్త- గూడూరు:

నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం వెడిచర్ల సెగ్మెంట్ పరిధిలోని మంగళపూరు గ్రామంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గూడూరు వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సొంత గ్రామమైన మంగళపూరులో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రజలు ప్రచారంలో పాల్గొనడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో నిర్వహించిన ప్రచారానికి విశేష స్పందన లభించిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

వెడిచర్ల సెగ్మెంట్‌లో టీడీపీ గెలుపుపై తమకు పూర్తి విశ్వాసం ఉందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు. గ్రామస్థులంతా ఒకే తాటిపై నిలిచి ప్రచారంలో పాల్గొన్నారని తెలిపారు. ఇప్పటివరకు నెలకొన్న సందేహాలకు మంగళపూరు ప్రచార కార్యక్రమం సమాధానంగా నిలిచిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లు రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి టీడీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొత్తానికి మంగళపూరులో జరిగిన ప్రచార కార్యక్రమంతో వెడిచర్ల సెగ్మెంట్‌లో ఎన్నికల సందడి నెలకొంది. ప్రచారంలో వ్యక్తమైన ప్రజల స్పందన ఓట్ల రూపంలో ఎంతవరకు ప్రతిఫలిస్తుందో నవంబర్ 5న జరిగే పోలింగ్ అనంతరం తేలనుంది.



వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు,బెదిరింపులు

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

గ్లోబల్ వార్త - పులివెందుల

ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఓటు హక్కు సొత్తుతో సమానమని అలాంటి ఓటు హక్కును దొంగలించే ప్రయత్నం చేయడం సరికాదని, ఎన్నికల రోజు బయటి ప్రాంత వ్యక్తులను తరలించి వారితో దొంగ ఓట్లు వేయించే ప్రయత్నాన్ని తెదేపా నేతలు కొనసాగించే ప్రయత్నం చేస్తున్నారని, మీడియా ద్వారా మరియు వినతుల ద్వారా ఎలక్షన్ కమిషన్లకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతం అర్థం కావడం లేదని జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఉన్నటువంటి పరిస్థితులను ఆయన తెలియజేస్తూ జమ్మలమడుగు ప్రచార ముగింపు సమయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నేతల కార్లను ధ్వంసం చేశారని,ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని, కడపలోనూ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.మైదుకూరు,ప్రొద్దుటూరు,జమ్మలమడుగు, కమలాపురం తదితర ప్రాంతాల నుంచి వేలాది మందిని,కిరాయి మూకలను పులివెందులకు రప్పించి పోలింగ్‌ను అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.ప్రజల ఓటు హక్కును వేరొకరికి ఇవ్వవద్దని,భయపడకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటును తామే స్వయంగా వినియోగించుకోవాలని కోరారు.దొంగ ఓట్లు వేసేందుకు ఇతరుల హక్కులను కాలరాయవద్దని హెచ్చరించారు.మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అసలైన ఓటర్లకు స్లిప్పులు చేరకుండా తొక్కిపెట్టి,వాటిని దొంగ ఓట్లు వేసే వారికి ఇచ్చేందుకు అధికారులు, టీడీపీ శ్రేణులు కలిసి కుమ్మక్కయ్యారని విమర్శించారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాల నిఘా ఉంచాలని, రికార్డులను భద్రపరచాలని, ఏజెంట్లకు పూర్తి భద్రత కల్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. పోలింగ్‌లో జరిగే అక్రమాలపై ఎన్నికల పిటిషన్లు వేసి అన్యాయాలను నిరూపిస్తామని స్పష్టం చేశారు.స్థానిక పరిస్థితుల దృష్ట్యా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన షెడ్యూల్‌లో మార్పు జరిగిందని వెల్లడించారు.



చిన్నమండెం వైఎస్ఆర్ సిపి జడ్పిటిసి అభ్యర్థి పి. దేవనాథ రెడ్డి అక్రమ అరెస్ట్

గ్లోబల్ వార్త - చిన్నమండెం : స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నమండెం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి శనివారం పడమటి కోన దేవనాథరెడ్డి దిగువగొట్టివీడు, చాకిబండ గ్రామాలలో శాంతియుతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి తిరిగి వస్తుండగా కొత్తపల్లి వద్ద పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినట్లు వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. దేవనాధ రెడ్డి వాహనంలో పోలీసులే డబ్బులు పెట్టి, అనంతరం వీడియోలు, ఫోటోలు తీసుకుని దేవనాధ రెడ్డి , మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు బాబు రెడ్డి, ముసల్ రెడ్డి, డ్రైవర్ సుధాకర్ లను అక్రమంగా నిర్బంధించారని పేర్కొన్నారు. పోలీసులు ఏకపక్షంగా అధికార పార్టీకి కొంగు కాస్తూ, ఇలా విచ్చలవిడిగా వైసిపి పార్టీ నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ప్రజాస్వామ్యంలో ఓటు అడిగి హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. అధికార పార్టీలో ఉంటూ వారు మాత్రం ఎక్కడ ఓటు కూడా అడగకుండా, అక్రమ దారిలో వెళుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని పేర్కొన్నారు. వైయస్సార్ పార్టీ తరపున అభ్యర్థులు శాంతియుతంగా ప్రచారం చేసుకుంటూ ఓటు అడుగుతుంటే ఇలా అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో ఇష్టానుసారంగా వివరించడం, పోలీసులే వైసిపి అభ్యర్థుల వాహనాలలో డబ్బు పెట్టడం, వెంటనే అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారు. జరుగుతున్న పరిణామాలన్నీ ప్రజల గమనిస్తూనే ఉన్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని తెలిపారు. దిగువగొట్టివీడు, చాకిబండ గ్రామాలలో వైఎస్ఆర్ సిపి జెడ్ పి టి సి అభ్యర్థి దేవనాథరెడ్డికి బ్రహ్మరథం పట్టిన ఆయా గ్రామాల ప్రజలు దిగువగొట్టివీడు,చాకిబండ గ్రామాలలో వైఎస్ఆర్ సిపి జెడ్ పి టి సి అభ్యర్థి దేవనాథరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు దేవనాథరెడ్డికి బ్రహ్మరథం పట్టారు. ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు, కర్పూర హారతులుతో స్వాగతం పలికారు. సంక్షేమ పాలన అందించిన గత జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తామని , జెడ్ పి టి సి అభ్యర్థి దేవనాథరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ఆయా గ్రామాల ప్రజలు స్పష్టం చేశారు.రెండు గ్రామాలలో ఎన్నికల ప్రచారం ముంగించికుని కొత్తపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న దేవనాథరెడ్డి, ఇతర వైఎస్ఆర్ సిపి నాయకులుపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారు.



యూట్యూబర్ల హద్దు మీరితే చర్యలు తప్పవు

డీఐజీ కోయ ప్రవీణ్ హెచ్చరిక

గ్లోబల్ వార్త – కడప నగరంతో పాటు జిల్లాలో రేపు జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మీడియా ప్రతినిధులకు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కీలక సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద యూట్యూబ్ ఛానళ్ల పేరుతో అనవసర హంగామా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అక్రిడిటేషన్ కార్డుతో పాటు ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాస్ ఉన్న జర్నలిస్టులకు మాత్రమే పోలింగ్ కేంద్రాల వద్దకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లాలోని పోలీసు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి హద్దులు దాటితే చట్టపరంగా చర్యలు తప్పవని డీఐజీ కోయ ప్రవీణ్ హెచ్చరించారు.

సర్దార్ పటేల్ 151వ జయంతి

జాతీయ ఐక్యతా దివస్ సందర్భంగా ప్రముఖుల నివాళులు!

భారత ఉక్కు మనిషి, దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ఇవాళ (అక్టోబర్ 31) దేశవ్యాప్తంగా 'జాతీయ ఐక్యతా దివస్' ఘనంగా జరుపుకుంటున్నారు. రాజధాని ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా పలువురు నాయకులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.(ఝతీఃఝుతీ ఖ్ఫవశ్రీ 151ర్ ఝీఃఝుఖ్ఞఅ)ఢిల్లీలో ప్రముఖుల అంజలి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి: ఢిల్లీలో ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ పటేల్‌కు పుష్పాంజలి ఘటించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధూ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తదితరులు పాల్గొని పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. మహారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కూడా పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నివాళులర్పించారు.

ప్రధాని నరేంద్ర మోదీ సందేశం

ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. సర్దార్ పటేల్‌ను 'అఖండ భారత్ శిల్పి' అని కొనియాడారు. బలమైన, సమర్థవంతమైన, స్వయంసమృద్ధి కలిగిన భారతదేశ నిర్మాణానికి పటేల్ తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన త్యాగం వికసిత భారత్ నిర్మాణానికి ప్రేరణ అని పేర్కొన్నారు.

బీఓబీ లాభం రూ.6,737 కోట్లు

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రికార్డు స్థాయిలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.6,532 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. బ్యాంక్ చరిత్రలో ఒక త్రైమాసికంలో సాధించిన అత్యధిక నికర లాభం ఇదే. సమీక్షా త్రైమాసికంలో దేశీయ డిపాజిట్లు 16.6 శాతం పెరిగి రూ. 14.83 లక్షల కోట్లకు, గ్లోబల్ డిపాజిట్లు 16.4 శాతం పెరిగి రూ.17.45 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

నేడు పులివెందులలో వైయస్ జగన్ పర్యటన

ఓటు హక్కు వినియోగించుకోనున్న మాజీ సీఎం

గ్లోబల్ వార్త – పులివెందుల



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేడు పులివెందులలో పర్యటించనున్నారు. పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో ఆయన పాల్గొని తన ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేటి మధ్యాహ్నం పులివెందులకు చేరుకొని స్థానిక పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకుంటారని ఓటు వేసిన అనంతరం సాయంత్రం పులివెందుల నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పులివెందులలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వైయస్ జగన్ పర్యటన నేపథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశాయి.

జనాలు లేకుండా ప్రచారమా?

పీఏలపై బాలయ్య ఆగ్రహం!



మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీకి గెలుపు అవకాశాలు లేవని అంతర్గత సర్వేల్లో తేలడంతో షూటింగ్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎమ్మెల్యే బాలకృష్ణ విశ్రాంతి తప్పనిసరి అయినా ఎన్నికల ప్రచారానికి పురంలో పర్యటిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం శుక్రవారం ఆఖరిరోజు కావడంతో ఎమ్మెల్యే బాలకృష్ణ ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. బాలకృష్ణ సభలో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. బాలకృష్ణ మాట్లాడుతున్న సమయంలో కొందరు లేచి వెళ్లిపోయారు. జనాలు ఆసక్తి చూపించకపోవడంతో బయ టనుంచి కూలీ ఖర్చులు చెల్లించి జనాలను రప్పించారు. వారికి కూడా సమయం అయిపోవడంతో ఒక్కొక్కరుగా లేచి వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యే బాలకృష్ణ తీవ్ర అసహనంతో కనిపించారు. ఎన్నికల ప్రచారానికి జనాలని తీసుకురావడం కూడా తెలియదా అని పీఏలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన..

శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకే ఎన్నికల ప్రచారం ముగియగా, ఎమ్మెల్యే బాలకృష్ణ 5.30 గంటలైనా సభలో ప్రసంగించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. కోడ్ ఉల్లంఘన జరుగుతున్నా అధికార యంత్రాంగం కనీసం చెప్పే ప్రయత్నం కూడా చేయలేదు.

మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ పార్టీ ఓడిపోతే

ఇరాన్‌పై భారీ దాడులకు వ్యూహం..?

ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారీ సైనిక చర్యకు దిగే అవకాశాలున్నాయనే వార్తలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. నవంబర్ 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘోరంగా ఓడిపోతే.. ఇరాన్‌పై ట్రంప్ పెద్ద ఎత్తున సైనిక ఆపరేషన్‌కు ఆదేశించే అవకాశం ఉందని ఓ మీడియా సంస్థ వెల్లడించింది .అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు ఓడిపోతే ట్రంప్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని 'ఆక్సియోస్' ఓ నివేదిక వెలువరించింది. రాజకీయంగా అవమానా నికి గురైనట్లు భావిస్తే ట్రంప్ ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకోవచ్చని ఓ అధికారి వ్యాఖ్యానించినట్లు పేర్కొంది. అయితే ఈ వాదనను వైట్‌హౌస్ అధికారి తోసిపుచ్చారు. ఎన్నికల ఫలితాలకు, ఇరాన్‌పై తమ నిర్ణయాలకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఇరాన్‌పై మరోసారి పెద్ద ఎత్తున సైనిక చర్యలు చేపట్టేందుకు అమెరికా సైన్యం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు గతంలోనూ వార్తలు వచ్చాయి .



అధ్యక్షుడు ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లోనే దాడులు ప్రారంభించే సామర్థ్యంతో బలగాలు సిద్ధంగా ఉన్నాయని అమెరికా అధికారులను ఉటంకిస్తూ సీబీఎస్, సీఎన్ఎన్ కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌లోని సైనిక స్థావరాలు, అణు కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలు లక్ష్యంగా మారే అవకాశం ఉందని ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే ట్రంప్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని అధికారులు స్పష్టం చేశారు.

ప్రాణమంటే ఇంత నిర్లక్ష్యమా..?

గర్భిణి, కడుపులోని శిశువు మృతితో కన్నీరుమున్నీరైన కుటుంబం

ఎమ్మెల్యే సూచించినా మారని తీరు.. బాధ్యులెవరు?

గ్లోబల్ వార్త – రంగారెడ్డి జిల్లా : షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో మరోసారి చోటుచేసుకున్న విషాద ఘటన వైద్య సేవల తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. పురిటి బిడ్డను చేతుల్లోకి తీసుకోవాలని ఆశించిన ఓ కుటుంబానికి తల్లి, బిడ్డ ఇద్దరినీ కోల్పోయిన తీరని దుఃఖం మిగిలింది. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన మల్లని రమేష్ కుమార్, రాధా దంపతులు ప్రసవం కోసం శుక్రవారం ఉదయం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం.. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాధాను ఆసుపత్రిలోనే ఉంచి వైద్యం అందించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నప్పుడు ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాల్సి ఉండగా, చివరి దశలో పరిస్థితి విషమించాక హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారని బంధువులు ఆరోపిస్తున్నారు. అప్పటికే పరిస్థితి చేయి దాటిపోవడంతో తల్లి, కడుపులోని శిశువు ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రధానంగా నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలే ఆధారపడుతుంటాయి. అలాంటి



చోట వైద్య సేవల్లో లోపాలు ఉన్నాయనే ఆరోపణలు పదేపదే రావడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలే షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వైద్య బృందంతో సమీక్ష నిర్వహించి, ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ అంకితభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. అయితే ఆ సమీక్ష జరిగిన కొద్ది రోజులకే మరో విషాద ఘటన చోటుచేసుకోవడంతో ఆసుపత్రి పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



విజయవాడలో ఎన్నికల సామాగ్రి పంపిణీ

పోలింగ్‌కు సర్వం సిద్ధం

గ్లోబల్ వార్త – విజయవాడ : ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నగరంలోని లయోలా కళాశాల ప్రాంగణంలో విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ మొదలైంది. 85 డివిజన్ల కార్పొరేటర్లు, మేయర్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల సామాగ్రి తరలింపు ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడ నగరంలో ఒక డివిజన్ ఇప్పటికే ఏకగ్రీవం అయిందన్నారు.85 డివిజన్లకు ఆదివారం ఎన్నికలు జరగబోతున్నాయని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. నగరంలో మొత్తం 848 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 10 వేల మంది అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. నగరంలో 150సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ క్యాస్టింగ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేశామని మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర పేర్కొన్నారు.



కదిరి పట్టణంలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆకస్మికంగా తనిఖీ

గ్లోబల్ వార్త – కదిరి

సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో చేపడుతున్న భద్రతా ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల పనితీరు, లెక్కింపు హాల్స్ ఏర్పాటును జేసీ క్షుణ్ణంగా పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిబ్బందికి కేటాయించిన విధులు, సీసీ కెమెరాల నిఘా, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు తదితర మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో లెక్కింపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కదిరి ఆర్డీఓ కళావతి, కదిరి ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, కదిరి తహశీల్దార్ రెడ్డి శేఖర్ తో పాటు పలువురు రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు పారితోషికం పెంపు..

గ్లోబల్ వార్త – అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పారితోషికం పెంచింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా కేటగిరీల వారీగా గతంలో ఉన్న పారితోషికంలో మార్పులు చేస్తూ జీవో జారీ చేసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వివిధ కారణాలతో ప్రమాదం సంభవిస్తే ఇచ్చే పరిహారంలోనూ మార్పులు చేసింది. ఈ మేరకు జీవో నంబర్ – 1345,1346లను మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ జారీ చేశారు.



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్

ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో ఆకిబ్ నబీకి ఛాన్స్



న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు భారత జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. గాయం కారణంగా జట్టుకు దూరమైన స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో జమ్మూ కశ్మీర్ సంచలనం ఆకిబ్ నబీకి బీసీసీఐ అవకాశం కల్పించింది. కాగా నవంబర్ 4 నుంచి భారత్–న్యూజిలాండ్ జట్లు ఐదు వన్డేల సిరీస్‌లో తలపడనున్నాయి. తొలుత చివరి రెండు వన్డేల కోసం మాత్రమే ఎంపికైన నబీ.. తాజా పరిణామాలతో తొలి మూడు వన్డే మ్యాచ్‌ల్లో కూడా ఆడనున్నాడు. కాగా ఈ సిరీస్‌లో భారత్ రెండు వేర్వేరు జట్లతో బరిలోకి దిగనున్న సంగతి తెలిసిందే.

వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో ప్రసిద్ధ్ కృష్ణ గాయపడ్డాడు. అయితే ఫిట్‌నెస్‌కు లోబడి భారత వన్డే జట్టులో ప్రసిద్ధ్‌కు చోటు కల్పించారు. అయితే గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు అతడిని దూరంగా ఉంచాలని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. రానున్న టెస్టు సిరీస్‌కు అతడు పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

పేస్ బాధ్యతలు తీసుకునేదెవరు?

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత పేస్ విభాగం కొంత అనుభవలేమితో కనిపిస్తోంది. అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీకి అంతర్జాతీయ స్థాయిలో పరిమిత అనుభవమే ఉంది. మహ్మద్ సిరాజ్ మాత్రమే 50కి పైగా వన్డేలు ఆడిన ప్రధాన పేసర్‌గా జట్టులో ఉన్నాడు. మరోవైపు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. దీంతో పేస్ బాధ్యతలు తీసుకునేదెవరనే చర్చ మొదలైంది.



భారత క్రికెట్ భవిష్యత్తుకు వైభవ్ మంచి పెట్టుబడి : సనత్ జయసూర్య

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై శ్రీలంక మాజీ కెప్టెన్ సనత్ జయసూర్య ప్రశంసలు కురిపించాడు. ఈ 15 ఏళ్ల యువ క్రికెటర్‌కు భారత జట్టు స్వేచ్ఛనివ్వాలని సూచించాడు. అతడిపై అనవసర అంచనాలు, ఒత్తిడి పెంచకుండా సహజసిద్ధమైన ఆట ఆడేందుకు ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డాడు. వైభవ్ భారత క్రికెట్ భవిష్యత్తుకు మంచి పెట్టుబడి అని పేర్కొన్నాడు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న అతడు.. వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'వైభవ్‌కు ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. అతడు భారత క్రికెట్‌కు మంచి భవిష్యత్తు. తన సహజమైన ఆటను ఆడనివ్వండి. అతడి పని అతడిని చేసుకోనివ్వండి. అలా చేస్తే భారత క్రికెట్‌కు అతడు మంచి పెట్టుబడిగా మారతాడు. వైభవ్ తన దూకుడైన బ్యాటింగ్‌తో ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇలాంటి ప్రతిభావంతుడైన ఆటగాడి సహజమైన ఆటతీరులో జోక్యం చేసుకోకుండా ఎదిగేందుకు అవకాశం కల్పించాలి. భారత జట్టులో చాలా మంది ప్రతిభావంతులైన క్రికెటర్లు ఉన్నారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ విషయానికి వస్తే.. అతడు ఆల్‌రౌండర్ బ్యాటర్. అతడి ఆటలో చాలా స్పెషాలిటీస్ ఉన్నాయి. మైదానంలోని అన్ని వైపులా షాట్లు ఆడగలడు. అదే అతడి గొప్పతనం' అని జయసూర్య తెలిపాడు.

భారత పర్యటనపై శ్రీలంక గురి..

డిసెంబర్‌లో భారత్‌తో జరగనున్న వైట్‌బాల్ సిరీస్‌కు ముందు తమ జట్టు సన్నద్ధతపై జయసూర్య సంతృప్తి వ్యక్తం చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న ఇంగ్లండ్, పాకిస్థాన్, శ్రీలంక ముక్కోణపు సిరీస్‌లో శ్రీలంక ప్రదర్శన తమ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని చెప్పాడు. 'భారత పర్యటనకు ముందు మా జట్టు మంచి ప్రదర్శన చేస్తోంది. ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెరిగింది. వారు మంచి క్రికెట్ ఆడుతున్నారు. భారత్‌లోనూ ఇదే ప్రదర్శన కొనసాగిస్తారని ఆశిస్తున్నా. ఆటగాళ్లు భారీగా పరుగులు చేయడం, పెద్ద లక్ష్యాలను ఛేదించడం చూడటానికి చాలా బాగుంది. ఈ రోజుల్లో ఏదైనా సాధ్యమే. అయితే బ్యాటర్ల దూకుడు బౌలర్లపై ఒత్తిడిని కూడా పెంచుతోంది' అని జయసూర్య వివరించాడు.



అండర్-19 ఆసియా కప్‌లో.. ఆర్యవీర్, అన్వయ్

న్యూఢిల్లీ: మాజీ ఆటగాళ్లు రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్‌ల తనయులు అన్వయ్, ఆర్యవీర్ అండర్–19 ఆసియాకప్ వన్డే టోర్నీలో ఆడనున్నారు. వచ్చే నెల 5 నుంచి 14 వరకు మస్కట్‌లో జరిగే ఈ టోర్నీ కోసం శుక్ర వారం జట్టును ప్రకటించారు. 15 మందితో కూడిన ఈ బృందానికి లక్ష్య రాయ్‌చందానీ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గ్రూప్ 'ఎ'లో భారత్, పాక్, యూఏఈ, నేపాల్ ఉండగా.. గ్రూప్ 'బి'లో బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, మలేసియా ఉన్నాయి.



సెమీస్‌లో సింధుxఅన్మోల్

సార్‌బ్రూకెన్ (జర్మనీ): హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో స్టార్ షట్లర్ పీవీ సింధు, భారత్‌కే చెందిన యువ క్రీడాకారిణి అన్మోల్ ఖర్బ్ మధ్య ముఖాముఖి పోరు జరగనుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్స్‌లో సింధు 21–12, 21–10తో అమేలీ షుల్జ్ (జర్మనీ)పై, అన్మోల్ 21–17, 18–21, 21–16తో సహచర షట్లర్, ఆరోసీడ్ ఉన్నతి హుడాపై గెలిచి అమీతుమీకి సిద్ధమయ్యారు. ఇక, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 14–21, 21–17, 21–13తో కొల్జోనెన్ (ఫిన్లాండ్)ను ఓడించి సెమీఫైనల్ చేరాడు.



దక్షిణాఫ్రికా 387 ఆలౌట్

కేప్‌టౌన్: ముల్డర్ (115), రికెల్టన్ (101) సెంచరీలు చేయడంలో ఆస్ట్రేలియాతో మూడో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ లో 387 పరుగులకు ఆలౌటైంది. ముల్డర్, రికెల్టన్ ఆరో వికెట్‌కు 154 రన్స్ జోడించారు. దాంతో ఆఖరి రోజు ప్రత్యర్థి జట్టుకు 288 రన్స్ లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 329, ఆసీస్ 429 రన్స్ చేశాయి.



ముంబై బ్యాటింగ్ కోచ్ రాబిన్‌ఊతప్ప

న్యూఢిల్లీ: వచ్చే ఐపీఎల్ సీజన్‌కుగాను ఇప్పటికే పొలార్డ్‌ను చీఫ్ కోచ్‌గా ఎంపిక చేసుకున్న ముంబై ఇండియన్స్ తమ బ్యాటింగ్ కోచ్‌గా రాబిన్ ఊతప్పను నియమించింది. ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాదీ టి. దిలీప్, బౌలింగ్ కోచ్‌గా న్యూజిలాండ్‌కు చెందిన మిచెల్ మెక్‌క్లెనగన్, డెవల్‌పమెంట్ బౌలింగ్ కోచ్‌గా ధవళ్ కులకర్ణిలను ముంబై యాజమాన్యం ఖరారు చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA
D.NO. 28-2-22, II FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520002. EDITOR DONDLAVAGU BHAVYA. PH . 08562-461571 APTEL/2025/16480